పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం


రేగొండ: ఇంటింటా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేగొండ: పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మోడెం ఉమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రావులపల్లి గ్రామంలో కారు గుర్తుకు ఓటేయాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, పేద ప్రజలకు అండగా గండ్ర వెంకటరమణారెడ్డి నిలబడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మైస సుమలతభిక్షపతి నాయకులు గోగుల అశోక్‌రెడ్డి, తాజోద్దీన్, రాజు, శంకర్, బుచ్చిరెడ్డి, కిషన్‌చారి, మైస బాబు, ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద సభకు తరలిన నాయకులు

రేగొండ(కొత్తపల్లిగోరి): జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అంకం రాజేందర్, మటిక సంతోష్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సాయిని విజయముత్యం, వైస్ ఎంపీపీ కుందూరు ఉమారాణివిద్యాసాగర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు నాయకులు ఉమేష్ గౌడ్, భిక్షపతి, కానుగంటి శ్రీనివాస్, ఆవుల మహేందర్, సుమన్, సుదర్శన్, నవీన్, కోటి, చంద్రమౌళి, కృష్ణ, వినయ్, ఉదయ్, సూర్యతేజ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లిగోరి నుంచి సభకు వెళ్తున్న నాయకులు


రేగొండ నుంచి సభకు వెళ్తున్న నాయకులు

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పరుగులు


నడికూడ : మండల కేంద్రంలో ప్రచారంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి


గీసుకొండ : బీఆర్ఎస్‌లో చేరుతున్న గంగదేవిపల్లి వాసులు

- కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు
- అభివృద్ధి విషయంలో వెనక్కి తగ్గేది లేదు
- ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి
- పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి 'చల్లా'

నడికూడ: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి పరుగులు పెడుతుందని పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని నర్సక్కపల్లి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి, కౌకొండ, సర్వాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పరిపాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కే.యూ జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్ బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

గీసుకొండ: మండలంలోని గంగదేవిపల్లికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ముస్కు రమేష్, గోనె జయపాల్, రాజు, సతీష్, అయిలయ్య, పెద్దమల్లేశం ఉన్నారు.

దామెర : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. పరకాల బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మె పరిస్థితి లేదన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి విషయంతో వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఉన్నారు.


దామెర : బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మరోసారి ఆశీర్వదించండి..

- బీఆర్ఎస్ హుస్నాబాద్ అభ్యర్థి సతీశ్‌కుమార్


ప్రజలకు అభివాదం చేస్తున్న సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని.. ప్రజలు మరోసారి ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్ కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని తంగళ్లపల్లి, కూరెల్ల, ధర్మసాగర్‌పల్లి, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. పదేళ్ల క్రితం రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని, కేసీఆర్ సీఎం అయిన తర్వాతే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ. 400కే సిలిండర్ ఇస్తామని.. ఆసరా, రైతుబంధును పెంచుతామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలోని అన్ని అంశాలు అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, వైస్ చైర్మన్ తడకల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాము నాగేశ్వరి శ్రీకాంత్, గాజుల రమేష్, తోట భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సతీశ్‌కుమార్ వెంటే గౌడ సంఘం

చిగురుమామిడి: హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన గౌడ కులస్తులు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని గౌడ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పొన్నం గౌడ కుల సంఘ పరిరక్షణ కోసం ఏనాడు మాట్లాడలేదన్నారు. సతీశ్‌కుమార్ పది సంవత్సరాల కాలంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణాల కోసం వేలాది రూపాయలు ఖర్చుచేశాడన్నారు. సమావేశంలో చిగురుమామిడి మండల పరిషత్ అధ్యక్షురాలు కొత్త వినీత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, భీమదేవరపల్లి జెడ్పీటీసీ, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

దివ్యాంగులకు అండగా నిలుస్తున్న కేసీఆర్

- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డి


మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి


ప్రచారం చేస్తున్న కౌశిక్‌రెడ్డి తమ్ముడు ప్రణీత్‌రెడ్డి

కమలాపూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. గడిచిన 60 ఏళ్లలో దివ్యాంగులను ఏ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం దివ్యాంగుల కోసం ఆలోచించి గొప్ప నిర్ణయం తీసుకొని రూ.4వేల పింఛన్ అందిస్తున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. మోటార్లకు మీటర్లు పెట్టాలంటున్న బీజేపీ కావాలో.. మూడు గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్ కావాలో ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ కొత్త మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.5వేలకు పెంచుతున్నట్లు ప్రకటించిందని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్, కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, హుజూరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, దివ్యాంగులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి తమ్ముడి ప్రచారం

జమ్మికుంట: బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం తమ్ముడు పాడి ప్రణీత్‌రెడ్డి దంపతులు పట్టణంలోని 30 వార్డు కౌన్సిలర్ మద్ది లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు సమ్మెట సదానందం, పోడేటి రామస్వామి, అర్బన్ పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేరిక..

పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తొగరు శివకృష్ణ, అరెల్లి సంధ్య సమక్షంలో 20 మంది బీజేపీ మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్, యూత్ నాయకులు గుల్లి ప్రతాప్, అశోక్, లింగంపల్లి సరోజన, గంజి సంధ్య, వనమాల, లక్ష్మి, లావణ్య, శారద, సరోజన, స్వరూప, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

హుజూరాబాద్‌రూరల్: చెల్పూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ఓటేయాలని కోరుతూ శుక్రవారం నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ రాణిసురేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జయసుధవాసుదేవరెడ్డి, గ్రామ అధ్యక్షుడు సదానందం, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, సింగిల్‌విండో ఉపాధ్యక్షులు రజిత పాల్గొన్నారు.

ప్రజా సేవే నా వ్యాపకం


కళ్లెంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి


లింగాలఘణపురం : ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

- అవకాశం ఇచ్చి చూడండి అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తా
- జీడికల్ ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు తెస్తా ..
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

లింగాలఘణపురం: 'నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు.. చేయడానికి వ్యవసాయం లేదు.. ఉన్నదల్లా ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయడమే నా వ్యాపకం' అని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని కళ్లెం, సిరిపురం, జీడికల్, గుమ్మడవెల్లి, బండ్లగూడెం, లింగాలఘణపురం గ్రామాల్లో రెండో విడత ఎన్నికల ప్రచారం చేపట్టారు. తాను ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న సమయంలో లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాలు జనగామ నియోజకవర్గంలో ఉండడంతో సేవ చేసే భాగ్యం కలగలేదు.. ఈసారి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉన్నాయి.. గతంలో తాను చేసిన అభివృద్ధి గురించి తెలుసుకుని ఎమ్మెల్యేగా గెలిపించి చూడండి.. అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తా అని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి ఇందిర గతంలో ఒకసారి ఓడిపోయి అప్పటి నుంచి నియోజకవర్గానికి రాలేదు.. మళ్లీ ఎన్నికలు రాగానే ఓట్ల కోసం వస్తున్నారు.. హైదరాబాద్‌లో ఉండే ఆమెకు ఎందుకు ఓటు వేయాలి అని ప్రశ్నించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించి సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్లలో ఎంతో సాధించుకున్నాం.. 24 గంటల కరెంట్, రైతు బంధు, కల్యాణలక్ష్మి, పింఛన్లు, ఎంతో సంక్షేమం జరిగింది.. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిపించిన వెంటనే రూ.50 కోట్లతో జీడికల్ వీరాచల రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా.. జీడికల్ గ్రామస్తులకు వంద డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తానని కడియం హామీ ఇచ్చారు. మండల పరిధిలోని చెరువులన్నింటినీ దేవాదుల నీటితో నింపడంతోపాటు అవసరమైతే కొత్త కాల్వలు తవ్విస్తానని అన్నారు. ప్రచారం సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కిరణ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, సర్పంచ్‌లు లక్ష్మి, రాజు, శ్రీపాల్‌రెడ్డి, విజయకుమార్, ఎంపీటీసీలు కృష్ణవేణి, శ్రీనివాస్ రెడ్డి, మాధవికుమార్, భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు రంజిత్‌రెడ్డి, సంపత్, మనోహర్‌రెడ్డి, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.


వేలేరు : బొట్టుపెట్టి ఓటు అడుగుతున్న కడియం దివ్య

కుమార్తెల ప్రచారం

వేలేరు : బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపు కోసం ఆయన కుమార్తెలు కావ్య, దివ్య శుక్రవారం మండల కేంద్రంలో విస్తృత ప్రచారం చేశారు. శ్రీహరి మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి చేశారని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఎంపీటీసీలు సంధ్యభూపతి రాజు, జ్యోతి, మండల సమన్వయ కర్త బిల్లా యాదగిరి, మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్, గ్రామశాఖ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమాఖ్య సంపూర్ణ మద్దతు

జఫర్‌గఢ్: బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికి 'తెలంగాణ కార్మిక సమాఖ్య' సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు కలకోట రామన్న తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి 80 శాతం మంది కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారని, వారి సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, మరోసారి బీఆర్ఎస్‌కు అధికారం కట్టబెడితే కార్మికులకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల్ల సుజాత, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చింతల యాకయ్య, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జనగామ జిల్లా అధ్యక్షుడు కె.భాస్కర్, నాయకులు రమేష్, సుభాష్, ఇల్లందుల భీమన్న, సోమయ్య, ఎండీ జాంగీర్ పాల్గొన్నారు.


జఫర్‌గఢ్ : మద్దతు తెలుపుతున్న ముదిరాజ్‌లు

ముదిరాజ్‌లు అండగా నిలవాలి

బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికి ముదిరాజ్‌లు అండగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా మత్స్య సొసైటీ చైర్మన్ నీల రాజు, ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు అన్నెపు అశోక్ కోరారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో ముదిరాజ్ కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం నాయకులు చవనబోయిన కుమార్, అన్నెబోయిన ఉప్పస్వామి, కుక్కల సారంగం, తిప్పరబోయిన కృష్ణ, అన్నెబోయిన సంపత్, దర్గయ్య, రమేష్, యాట అశోక్, కృష్ణ, పరశురాములు, నర్సింగం పాల్గొన్నారు.

కుల సంఘాలు సహకరించాలి

చిల్పూరు: కడియం శ్రీహరి గెలుపునకు అన్ని కుల సంఘాలు సహకరించాలని జెడ్పీ, గ్రంథాలయ, చిల్పూరు ఆయన చైర్మన్లు పాగాల సంపత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీధర్‌రావు శుక్రవారం వేర్వేరుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ సరితబాలరాజు, వైస్ ఎంపీపీ సరితనరసింహ, పోలేపల్లి, రంజిత్‌రెడ్డి సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ ఉమసమ్మయ్య, ఇల్లందుల సుదర్శన్, యాదగిరి, గజ్జెల దామోదర్, గణగోని రమేష్, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై కేసు నమోదు

దామెర: అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన మహిళపై గురువారం ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. కాగా శుక్రవారం మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి


కొప్పులలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ మలేష్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి, ప్రగతిసింగారం, కొప్పుల గ్రామాల్లో శుక్రవారం పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. ఓటు హక్కును నిర్భయంగా ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎస్సై దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలి

కమలాపూర్: విద్యార్థులు ఏ రంగంలో విజయం సాధించాలన్నా ముందుగా ఒత్తిడిని అధిగమించాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రహసిత్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఇంటర్మీడియేట్ పరీక్షలు–ఒత్తిడిని అధిగమించడం ఎలా, మానసిక ఆరోగ్యం' అనే అంశాలపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, ఎంపీహెచ్ఎస్ విప్లవ్‌కుమార్, అధ్యాపకులు కవిత, శ్రీదేవి, డాక్టర్ సాంబశివయ్య, సురేష్‌బాబు, రాందాసు, కుమారస్వామి, శోభాదేవి, యామిని, శ్రీనివాస్, మల్లయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల సేకరణ పూర్తి

శాయంపేట : మండల పరిధిలోని 13 గ్రామాల్లో అర్హుల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను సేకరించినట్లు కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, తహసీల్దార్ సుభాషిణి తెలిపారు. మండల పరిధిలో 13 గ్రామాల్లో 6 మంది వృద్ధులను గుర్తించగా అందులో ఇటీవల ఇద్దరు మరణించినట్లు తెలిపారు. శక్రవారం 13మంది ఓటర్ల నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లను స్వీకరించినట్లు ఎన్నికల పోలింగ్ ఆఫీసర్ ఓపిఓ తెలిపారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న 19మంది

కమలాపూర్: మండలంలోని 80 ఏళ్లు పైబడిన 19 మంది వృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం హోం ఓటింగ్ వినియోగించుకున్నట్లు తహసీల్దార్ మాధవి తెలిపారు. మండలంలోని 37 మంది వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా గురువారం 16 మందితో, శుక్రవారం 19 మంది వినియోగించుకున్నట్లు తెలిపారు.

'న్యాయశ్రీ' అవార్డుకు ఎంపికైన మహేందర్

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది కలకోటి మహేందర్‌ను న్యాయశ్రీ అవార్డు వరించింది. అసైన్డ్ భూములపై రైతులకు పూర్తి హక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యాప్తంగా తన గళాన్ని వినిపించినందుకు మహేందర్‌ను న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కార్యనిర్వాహకుడు అంకెనపల్లి మల్లిఖార్జునరావు శుక్రవారం వెల్లడించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగనున్న సమావేశంలో హైకోర్టు జస్టిస్ సూరపల్లి నందా చేతుల మీదుగా అవార్డు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఐనవోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పంథిని శివారు వరంగల్–ఖమ్మం రహదారిపై జరిగింది. పంథిని గ్రామానికి చెందిన శిక రాజయ్య(45) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పని ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో వరంగల్ నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న కారు.. రాజయ్యను వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు బొల్లెపల్లి మధు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అతడికి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. మధుతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్ నాగరాజు, నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, జంగా రాఘవరెడ్డి ఉన్నారు.

మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడి నియామకం

నడికూడ: మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్‌పాషా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు, కమిటీ సభ్యులకు మహబూబ్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం కురిసింది.. ధాన్యం తడిసింది


కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుంటున్న రైతు

కమలాపూర్: బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన వర్షానికి కళ్లాల్లో కోసి ఆరబోసిన వరి ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దైంది. వరదకు కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకుని ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అకాల వర్షంతో చేతికొచ్చిన వరి ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.